

ప్రభుత్వ స్థలంలో వేసిన బీటీ రోడ్డు

అధికారులకే అంతుపట్టని రోడ్డు

- తొలగిస్తారా? ఉంచుతారా?

పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఉదయం ఖాళీ స్థలం, తెల్లవారే సరికి ఆ స్థలంలో బీటీ రోడ్డు దర్శనమిచ్చింది. దీంతో స్థానికులు, చూపర్లు ఆశ్చర్యపోతున్నారు. ప్రభుత్వ స్థలాలను రాత్రికిరాత్రే కబ్జా చేసి రోడ్లు వేస్తున్నారు కబ్జాదారులు. జీడిమెట్ల డివిజన్‌లోని పేట్‌బషీరాబాద్ సర్వేనెంబరు 25/1లోని బఫర్‌జోన్‌లో బీటీ రోడ్డు వేయడంతో, ఈ రోడ్డును ఎవరు వేశారని రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులను స్థానికులు అడిగితే రోడ్డు వేశారా? అని ఆశ్చర్యానికి గురవుతున్నారు. ఈ స్థలాన్ని 2007లో అల్వాల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులు కేటాయించారు. అప్పట్లో 2016-17సంవత్సరంలో ఈస్థలంలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నిర్మాణం చేపట్టేందుకు అప్పటి కార్పొరేటర్ కేఎం పద్మ ప్రతాప్‌గౌడ్ డీసీపీ శ్రీనివాస్‌రావుతో కలిసి పనులకు శంకుస్థాపన చేశారు. 2022లో ట్రాఫిక్ డీసీపీ, ఏసీపీ కార్యాలయాన్ని నిర్మించారు. ఆ కార్యాలయాలను అప్పటి మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అధికారులతో కలిసి ప్రారంభించారు. 2023 జన వరిలో కార్యాలయాలను ప్రారంభించిన అనంతరం ఆరు నెలల పాటు ట్రాఫిక్ పోలీసులు వాడుకున్నారు. ఏమైందో, ఏమో కానీ, దాదాపు రూ. 1 కోటితో నిర్మించిన కార్యాలయాలను జూన్ 23న గత ప్రభుత్వ హయాంలో రాజకీయ నాయకులు, పెద్దలు ఒత్తిళ్లతో మున్సిపల్ అధికారులు ఈ స్థలాన్ని రోడ్డుకు కేటాయించారని పోలీసులను ఈ కార్యాలయాలు కూల్చి వేయాలని ఆదేశించారు. అనంతరం ఎక్స్‌కవేటర్‌తో పోలీసులు కార్యాలయాలను కూల్చి వేశారు. అప్పటి నుంచి ఖాళీగా ఉన్న ఈ స్థలంపై కన్నేసిన ఓ కన్‌స్ట్రక్షన్ నిర్మాణదారులు, నిర్మాణానికి రహదారి ఏర్పాటు చేసుకునేందుకు రాత్రికి రాత్రే ఈఖాళీ స్థలంలో బీటీ రోడ్డు వేశారు. ఈ రోడ్డు జీహెచ్ఎంసీ అధికారులే వేయించారని చెప్పుకోవడంతో స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. అధికారులే పోలీసులకు కూల్చివేయాలని ఆదేశాలు జారీ చేసి, ఈకార్యాలయాలను కూల్చి వేసిన తరువాత, మళ్లీ అదే అధికారులు రోడ్డు వేయించడం ఏమిటని స్థానికులు మండిపడుతున్నారు. ఈ రోడ్డు వేసిన విషయం జీహెచ్ఎంసీ, నీటి పారుదల శాఖాధికారులకు తెలియకపోవడం గమనార్హం. ప్రభుత్వ స్థలాన్ని కాపాడుతారా? లేక? కబ్జాదారులకే వదిలేస్తారా అనే సందేహంలో ప్రజలు ఉన్నారు.

రోడ్డు వేసిన స్థలాన్ని త్వరలో పరిశీలిస్తాం

రోడ్డు వేసిన స్థలాన్ని త్వరలో పరిశీలిస్తాం. ప్రభుత్వ భూమిలో అక్రమంగా రోడ్డు వేయకూడదు. వేస్తే దానిని తొలగించి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తాం.

- అబ్దుల్ రహీమ్, తహసీల్దార్, కుత్బుల్లాపూర్ మండలం

గృహజ్యోతి వివరాల అప్‌డేట్ నిరంతర ప్రక్రియ

- తెల్లరేషన్ కార్డు ఉన్నవారి వివరాల సేకరణ
- స్పాట్ బిల్లింగ్ మెషీన్లలో నమోదు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): గృహజ్యోతి వివరాల అప్‌డేట్ నిరంతర ప్రక్రియ అని విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం వచ్చిన 'వస్తారా.. వెళ్లాలా..?' గృహజ్యోతి వివరాల సేకరణపై అస్పష్టత అనే కథనానికి వివిధ ప్రాంతాల్లో దరఖాస్తుదారుల వివరాలు సేకరిస్తున్న విద్యుత్ అధికారులు స్పందించారు. ప్రజాపాలనలో గృహజ్యోతికి దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు స్పాట్ బిల్లింగ్ మెషిన్ల (ఎస్‌పీఎం)లో అప్‌డేట్ చేయడంతోపాటు తెల్లరేషన్‌కార్డు ఉండి ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోలేని వారి వివరాలు కూడా నమోదు చేసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. కాలనీలు, బస్తీల్లో విద్యుత్‌సిబ్బంది, అధికారులు ఇళ్లకు వెళ్లినప్పుడు కొంతమంది గృహాల్లో ఉండడం లేదని అలాంటి వారికోసం సమీపంలో ప్రత్యేక కౌంటర్లు, హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేసి విద్యుత్ సిబ్బంది ట్యాబ్‌లు, ఫోన్లలో గృహజ్యోతి వివరాలు అప్‌డేట్ చేస్తున్నట్లు తెలిపారు. సర్వర్ సమస్య తలెత్తిన ప్రాంతాల్లో విద్యుత్‌సిబ్బంది కనెక్షన్‌దారుడి నుంచి తెల్లరేషన్‌కార్డు, ఆధార్ నంబర్, ప్రజాపాలన దరఖాస్తు నంబర్, ఫోన్ నంబర్లు నమోదు చేసుకొని ఆ వివరాలను తర్వాత ఎస్‌పీఎంలో అప్‌డేట్ చేస్తున్నట్లు తెలిపారు. అద్దె ఇళ్లల్లో నివాసముండే వారికి తెల్లరేషన్ కార్డు ఉంటే మీటర్ ఎవరిపేరు మీద ఉన్నా వారి వివరాలు కూడా స్పాట్ బిల్లింగ్ మెషీన్లలో అప్‌డేట్ చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

దయానంద సరస్వతి జయంత్యుత్సవాల్లో శోభాయాత్ర

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మహర్షి దయానంద సరస్వతి 200వ జయంత్యుత్సవాల సందర్భంగా ఈనెల 18న నిజాం కాలేజీ నుంచి రవీంద్రభారతి వరకు శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వీసీ ప్రొ.బి.జె.రావ్, తెలుగు రాష్ట్రాల ఆర్యసమాజ్ ప్రతినిధి డా.ధర్మతేజ తెలిపారు. మంగళవారం హెచ్‌సీయూలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను వెల్లడించారు. శోభయాత్ర అనంతరం రవీంద్రభారతిలో బృహత్ సభ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఒక ప్రచార రథాన్ని తయారు చేసి రాబోయే రెండేళ్లపాటు ఉభయ రాష్ట్రాల్లోని అన్ని గ్రామాల్లో మహర్షి దయానందుని బోధనలు, ప్రదేశాల పట్ల అవగాహన కల్పిస్తామన్నారు. మహర్షి దయానంద జీవిత చరిత్రపై ఆధారిత ఒక డాక్యుమెంటరీ ఫిల్మ్‌ను రూపొందించడం, దయానందుడు మానవ సమాజం విద్యారంగానికి చేసిన సేవలు, బోధనలపై అంతర్జాతీయ సెమినార్ ఉస్మానియా యూనివర్సిటీ కేంద్రంగా నిర్వహిస్తామన్నారు.

'ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు'

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పబ్‌లు, మాల్స్ వద్ద ఇష్టానుసారంగా వాహనాలు ఆపి, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ డీవీ శ్రీనివాసరావు హెచ్చరించారు. గచ్చిబౌలి సీపీ కార్యాలయంలో సైబరాబాద్ పరిధిలోని పబ్‌లు, మాల్స్ యాజమాన్యాలతో మంగళవారం డీసీపీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాల్స్, పబ్స్ నిర్వాహకులు ప్రత్యేక పార్కింగ్ ప్రాంతాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాదాపూర్ అడిషనల్ ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్, అడిషనల్ ట్రాఫిక్ డీసీపీ మేడ్చల్ వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వచేసిన సరుకుల పట్టివేత



అధికారులు గుర్తించిన పీడీఎస్ గోధుమలు

అల్లాపూర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యం, పీడీఎస్ గోధుమలు, కల్తీ నూనెలను అల్లాపూర్ పోలీస్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు పద్మావతినగర్‌లో రూ.10 లక్షలు విలువ జేసే 20 టన్నుల ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించిన గోధుమలు, క్వింటాళ్ల కొద్ది రేషన్ బియ్యం, కల్తీ నూనెలను బాలానగర్ ఎస్‌ఓటీ పోలీసులు మంగళవారం గుర్తించారు. అనంతరం గోధుమలు, బియ్యాన్ని స్టేట్ సివిల్ సప్లైస్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు అప్పగించారు. ఈ అంశంపై స్టేట్ సివిల్ సప్లైస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

హైదర్‌నగర్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఆర్థిక సమస్యలతో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తూర్పుగోదావరి జిల్లా మండపేట మండలం కేశవపురం గ్రామానికి చెందిన తమనపుడి భువన్(24) కేపీహెచ్‌బీ అడ్డగుట్ట సొసైటీలోని అనుపమ ఎగ్జిక్యూటివ్ డీలక్స్ హాస్టల్‌లో ఉంటూ టీసీఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం హాస్టల్ గదిలో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. భువన్ తండ్రి ఇటీవల మరణించడం, తల్లి పక్షవాతం బారిన పడటంతో ఆర్థిక ఇబ్బందుల వల్ల ఆత్మహత్యకు పాల్పడినట్టు పోలీసులు తెలిపారు.

కళ్లకు విశ్రాంతి అవసరం

- పరీక్షల సమయంలో జాగ్రత్తలు తప్పనిసరి

పరీక్షల సీజన్ మొదలైంది. విద్యార్థులు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. మంచి మార్కులు రావాలని తల్లి దండ్రులు తమ బిడ్డలకు చెప్పడంతో.. తెల్లవారుజామున 4 గంటలకు, సాయంత్రం నుంచి రాత్రి 12 గంటల వరకు చదివేస్తున్నారు. చదువుకునే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని, లేదంటే కంటి చూపు సమస్యలు వచ్చే అవకాశం ఉంటుందని నేత్ర వైద్యులు హెచ్చరిస్తున్నారు. చదివే సమయంలో కంటికి అప్పుడప్పుడు విశ్రాంతి ఇవ్వడం మర్చిపోకూడదని సూచిస్తున్నారు.

- బాలానగర్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి)




8 గంటల నిద్ర అవసరం..

ప్రతి విద్యార్థికి 8 గంటల నిద్ర అవసరం. లేదంటే బాల్యంలోనే కంటి సంబంధిత సమస్యలు వస్తాయని కంటి వైద్యులు హెచ్చరిస్తున్నారు. అక్షరాలు సరిగ్గా కనపడక పోతే కళ్లపై ఒత్తిడి పెరుగుతుంది. ప్రతి 30 నిమిషాల కొకసారి కళ్లకు విశ్రాంతి నివ్వాలని సూచిస్తున్నారు. పోషకాహార లోపం ఉన్న, శరీరంలో రక్త ప్రసరణ సరిగ్గా లేక పోయినా కంటి సమస్యలు ఉత్పన్నమవుతాయని వారు చెబుతున్నారు.

కంటి వైద్యుల సూచనలు

1. పరీక్షల టెన్షన్‌లో వెల్తురు సరిగ్గా లేని చోట చదవ కూడదు.
2. ప్రతి నిమిషానికి సుమారు 15 సార్లు కంటి రెప్పలు కొడుతుండాలి.
3. పడుకొని, అటూ ఇటూ తిరుగుతూ చదవ కూడదు.
4. కంటి అద్దాలు ఉంటే వాటిని తీసి చదివే ప్రయత్నం చేయకూడదు
5. పరీక్షలు ఉన్నప్పటికీ పిల్లలు సుమారు 7 నుంచి 8 గంటలు నిద్రపోయేలా తల్లి దండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి.
6. కంటి సమస్యలు రాకుండా ఉండాలంటే పాలు, పండ్లు, ఆకుకూరలు లాంటి పౌష్టికాహారాన్ని రెగ్యులర్‌గా తీసుకోవాలి.





ఏడాదికోసారి కంటి పరీక్షలు చేయించాలి



పుస్తకాల్లో ఉన్న అక్షరాలు సరిగ్గా కనపడేలా వెలుగు ఉన్న ప్రాంతంలో చదువుకోవాలి. 7 నుంచి 8 గంటలు నిద్ర పిల్లలకు తప్పని సరి. కంటి సమస్యలు రాకుండా విటమిన్ సీ, ఈ ఉన్న పాలు పండ్లు, ఆకుకూరలు, గుడ్లు పిల్లలకు ఆహారంలో ఇవ్వాలి. ఏడాదిలో ఒక సారైన తల్లి దండ్రులు తమ పిల్లలకు కంటి పరీక్షలు చేయించాలి.

- డా. ఎ.జయచంద్రారెడ్డి, సర్జన్, కంటి వైద్య నిపుణులు, అరబిందో నేత్రాలయ, కేపీహెచ్‌బీ కాలనీ

ప్రణాళిక బద్ధంగా చదవాలి



పరీక్షలంటే భయపడవద్దు. సరైన టైంకు నిద్ర పోవాలి. ఉదయం 4.30 గంటల సమయం నుంచి చదివితే ప్రయోజనకరంగా ఉంటుంది. చదువులో వెనుకపడిన వారు ప్రశ్నావళిని దృష్టిలో ఉంచుకుని పరీక్షలకు సిద్ధం కావాలి.

- ఎల్.శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యాయుడు, జిల్లా పరిషత్ హైస్కూల్, బాలానగర్

తల్లిదండ్రులు బాధ్యతగా ఉండాలి



పరీక్షల సమయంలో పిల్లలు ఎంతో టెన్షన్‌గా ఉంటారు. ఆ సమయంలో వారిని ఎలాంటి ఇబ్బందులకు గురి చేయకూడదు. కష్ట పడి చదివితే మంచి మార్కులు పొందవచ్చని ధైర్యం చెప్పాలి. తల్లి దండ్రులు పిల్లలకు టైంటూ టైం సమీకృత ఆహారం ఇస్తూ కనిపెట్టుకుని ఉండాలి.

- విజయబల్వీర్, ప్రిన్సిపల్, కృష్ణవేణి స్కూల్, ఫతేనగర్

మోడల్ కార్పొరేషన్‌గా అభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ నీలారెడ్డి

నిజాంపేట్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి మోడల్ కార్పొరేషన్‌గా తీర్చి దిద్దుతామని మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ రామకృష్ణారావు, సత్యనారాయణ ఆయా విభాగాల అధికారులతో కలిసి ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో పలు అభివృద్ధి పనులు, పెండింగ్‌లో ఉన్న నిర్మాణాలకు కావాల్సిన నిధులు, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలపై చర్చించారు. సమావేశంలో ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్, హార్టికల్చర్ అధికారులు, నాయకులు ఫ్లోర్ లీడర్ ఆగం పాండు ముదిరాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

రమేష్ విస్తృత పర్యటన



ఇందిరాగాంధీపురంలో పర్యటిస్తున్న కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి రమేష్, నాయకులు

ఫతేనగర్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఫతేనగర్ డివిజన్‌లో మంగళవారం కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ పార్టీ నాయకులతో కలిసి విస్తృత పర్యట చేశారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభాకర్‌రెడ్డినగర్, ఇందిరాంధీపురం బస్తీ సంక్షేమ సంఘం ఎన్నికల్లో గెలుపొందిన అబ్దుల్ బాకీ, యూసుఫ్‌ను అభినందించారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి కాంగ్రెస్ ఏ బ్లాక్ అధ్యక్షుడు పి.నాగిరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు కె.రమేష్, ప్రొటోకాల్ సెక్రెటరీ సూరజ్ తివారీ, సీనియర్ నాయకుడు కె.రాజుముదిరాజ్, యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ సిటకోరు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న రఘునాథ్ స్వామి, ఉన్నతాధికారులు

బాలానగర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): బాలానగర్‌లోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ డైరీని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డా. రఘునాథ్ స్వామి ఆవిష్కరించారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి జోన్ డిస్ట్రిక్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డా. రామ్‌కుమార్, మల్కాజిగిరి డివిజన్ డిప్యూటీడిస్ట్రిక్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డా. ఆనంద్, కీసర డివిజన్ డిప్యూటీ డిస్ట్రిక్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డా.నారాయణ రావు, తెలంగాణ పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రెసిడెంట్ పి.రవికుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్. శ్యాంసుందర్, జనరల్ సెక్రెటరీ బొందుగుల వెంకటేశ్వర్‌రెడ్డి, కార్యదర్శి మరియమ్మ, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు: అనురాధ



మాట్లాడుతున్న అనురాధ

షాపూర్‌నగర్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణ, మహిళల సాధికారతే ప్రభుత్వ ధ్యేయమని చెప్పే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటనలకే పరిమితం అయ్యాయని ప్రగతిశీల మహిళా సంఘం(పీఓడబ్ల్యూ) రంగారెడ్డి, మేడ్చల్ కార్యదర్శి జి.అనురాధ అన్నారు. మంగళవారం సూరారం డివిజన్ సంజయ్‌గాంధీనగర్‌లో నిర్వహించిన రాజకీయ శిక్షణా తరగతుల కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళలు, పిల్లలు జీవనోపాధి, జీవన భద్రత కోల్పోయి ఇబ్బందులు పడుతున్నారని, మహిళా పక్షపాతులమని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ నాయకురాళ్ళు ఎం.సరళ, భారతి, జి.పద్మ, కత్తి పద్మ, వి.సంధ్య, మహిళలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి : జగన్



సీసీరోడ్డు పనులు ప్రారంభించిన కార్పొరేటర్ జగన్

జీడిమెట్ల, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని కార్పొరేటర్ కె.జగన్ అన్నారు. మంగళవారం రాజీవ్‌గృహకల్పలో స్థానిక సమస్యలపై ఆయన పాదయాత్ర చేశారు. స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో అంజయ్య, పరశురాం, గిరిబాబు, భూపతిరెడ్డి, మాధవి పాల్గొన్నారు.



వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యేలు

జగద్గిరిగుట్ట ప్రాంతంలోని వేంకటేశ్వరస్వామి 53 సంవత్సరాలుగా నిర్విరామంగా సాగుతున్న జాతరను ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద్, మాధవరం కృష్ణారావు, ఆరికెపూడి గాంధీ అన్నారు. మంగళవారం జాతర ఏర్పాట్లను ఎమ్మెల్యేలు నాయకులతో కలిసి పరిశీలించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ భద్రారెడ్డి, కార్పొరేటర్ కె.జగన్, ఆలయ ఛైర్మన్ వేణుయాదవ్, కమిటీ సభ్యులు పాపిరెడ్డి, ప్రవీణ్‌గుప్తా, బండ అనిత, బాబుగౌడ్ పాల్గొన్నారు. **- జీడిమెట్ల, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి)**



ఆలయ నిర్మాణాలకు విరాళంగా చెక్కులు అందజేస్తున్న మైసయ్యయాదవ్ కుటుంబ సభ్యులు

ఆలయాల నిర్మాణాలకు విరాళాలు

హైదర్‌నగర్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్‌లేట్ మైసయ్యయాదవ్ 10వ వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు మూసాపేట్ గూడ్‌షెడ్ రోడ్డులోని పోచమ్మతల్లి దేవస్థానం నిర్మాణానికి రూ.2,50,000, మైసమ్మచెరువు అలుగులోని ఈదమ్మతల్లి దేవస్థానం నిర్మాణానికి రూ. 50వేలు, మైసమ్మ చెరువు వద్ద ఉన్న దోబీఘాట్ దగ్గర ఈదమ్మ ఎల్లమ్మ తల్లి దేవస్థాన నిర్మాణానికి రూ. 25,000 విరాళం అందజేశారు.

జేఈఈ మెయిన్స్‌లో సత్తాచాటిన విద్యార్థులు



సాయిరామ్ 99.46శాతం



వెంకటేష్ 99.31శాతం

రాయదుర్గం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో గౌలిదొడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థులు 80 మంది ఐఐటీ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించి తమ సత్తాచాటారు. ఏర్రంబాటి సాయిరామ్ 99.46 శాతంతో ప్రథమ స్థానంలో నిలవగా, ఊట్కూరి వెంకటేష్ 99.31శాతంతో రెండో స్థానంలో నిలిచి ఐఐటీ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించారు. 22మంది విద్యార్థులు 90శాతం పైగా, 40మంది 80శాతం పైగా, 56మంది 60శాతం పైగా, 80మంది విద్యార్థులు 50శాతంతో జూన్‌లో జరిగే ఐఐటీ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించారు. మొత్తం వందమంది కళాశాల నుంచి పరీక్ష రాసినట్లు ప్రిన్సిపాల్ వట్టికొండ పాపారావు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గురుకుల సంస్థ కార్యదర్శి కె.సీతాలక్ష్మి, సంయుక్త కార్యదర్శి సక్కునాయక్, ఓఎస్‌డీ రంగారెడ్డి, ఆర్‌సీఓ డాక్టర్ శారద వెంకటేష్ అభినందించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన నిరుపేద కుటుంబాల విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఇంతటి విజయాలు సాధించడం అభినందనీయమని అన్నారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.

కూకట్‌పల్లి ఏసీపీగా శ్రీనివాస్‌రావు



కూకట్‌పల్లి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి శాంతిభద్రతల విభాగం ఏసీపీగా కాపుగాని శ్రీనివాస్‌రావు నియమితులయ్యారు. డీజీపీ కార్యాలయంలో ఐటీ విభాగంలో విధులు నిర్వహిస్తున్న అయన్ను కూకట్‌పల్లికి బదిలీ చేస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. కూకట్‌పల్లిలో ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న పి.శివభాస్కర్‌ను డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేశారు. ఏసీపీగా శ్రీనివాస్‌రావు బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

జాతర పోస్టర్ ఆవిష్కరణ

షాపూర్‌నగర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రాజీవ్‌గాంధీనగర్‌లోని మల్లికార్జున ఆలయ ఆధ్వర్యంలో ఈనెల 25, 26, 27 తేదీల్లో నిర్వహించనున్న జాతర పోస్టర్‌ను మంగళవారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఆవిష్కరించారు. జాతరకు హాజరయ్యే భక్తులకు అసౌకర్యం కలుగకుండా చూడాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ సభ్యులు ఫాక్స్ డైరెక్టర్ పరిశ శ్రీనివాస్‌యాదవ్, సభ్యులు సత్యనారాయణయాదవ్, గోపాల్‌యాదవ్, బాలరాజ్‌యాదవ్, శ్రీశైలంయాదవ్, సంపత్‌యాదవ్ పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారానికి కృషి'

హైదర్‌నగర్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ జయశంకర్‌నగర్ బస్తీలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. స్థానికంగా ఉన్న సమస్యలపై అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని కోరారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని స్థానికులకు సూచించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు మారేళ్ల శ్రీనివాస్, నాయకులు మన్నేపల్లి సాంబశివ రావు, శేషు, శిరీష, రవి, రఫీక్, కృష్ణ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ జాయింట్ సీపీగా జోయల్ డేవిస్



హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ కమిషనరేట్ ట్రాఫిక్ జాయింట్ పోలీస్ కమిషనర్‌గా జోయల్ డేవిస్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రంలో సోమవారం రాత్రి జరిగిన ఐపీఎస్ అధికారుల బదిలీల్లో జోయల్ డేవిస్‌ను ట్రాఫిక్ జాయింట్ సీపీగా ప్రభుత్వం నియమించింది. అక్కడ జాయింట్ సీపీగా ఉన్న నారాయన్ నాయక్‌ను ఎస్‌సీఆర్‌బీ, సీఐడీ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా నియమించింది.

గుర్తుతెలియని మృతదేహాలు లభ్యం

చందానగర్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకా రం.. చందానగర్ హుడా కాలనీలో కూరగాయల మార్కెట్ కోసం నిర్మించిన షెడ్డులో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెంది ఉన్నాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకొని విచారించగా వివరాలు తెలియరాలేదని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

మల్లంపేట ఓఆర్ఆర్ సమీపంలో..

దుండిగల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధి మల్లంపేట ఓఆర్ఆర్ సమీపంలో గుర్తు తెలియని వృద్ధుడి మృత దేహం లభ్యమైంది. గుర్తు తెలియని వృద్ధుడి మృత దేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు అక్కడికి చేరుకొని మృతుడి వివరాలు సేకరించగా.. భిక్షాటన చేసుకొనే వృద్ధుడిగా అనుమానిస్తున్నారు. పోస్టు మార్టం నిమిత్తం మృత దేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బహిరంగ సభకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు



కార్పొరేటర్లు, పార్టీ శ్రేణులతో కలిసి బహిరంగ సభకు వెళ్తున్న ఎమ్మెల్యే గాంధీ



దుండిగల్ నుంచి వెళ్తున్న బీఆర్ఎస్ నేతలు



వీవీనగర్ డివిజన్ నుంచి బస్సులో వెళ్తున్న నాయకులు

మియాపూర్, ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): నల్గొండలో జరిగే బహిరంగ సభకు ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ఆధ్వర్యంలో కార్పొరేటర్లు నాయకులు, కార్యకర్తలతో కలిసి తరలివెళ్లారు. ఈసందర్భంగా గాంధీ మాట్లాడుతూ కృష్ణా బేసిన్ ప్రాజెక్టులను కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ) కేంద్ర ప్రభుత్వానికి అప్పగిస్తూ కాంగ్రెస్ ప్రభు త్వం అనుసరిస్తున్న తెలంగాణ వ్యతిరేక వైఖరిని ఖండిస్తూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపు మేరకు సభకు వెళ్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్, హమీద్ పటేల్, దొడ్ల వెంకటేష్‌గౌడ్, నార్నె శ్రీనివాసరావు, జూపల్లి సత్యనారాయణ, ఉప్పలపాటి శ్రీకాంత్, మంజుల, రోజాదేవి, సింధు, మాజీ కార్పొరేటర్ సాయిబాబా, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

- **హైదర్‌నగర్:** హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ డివిజన్ల కార్పొరేటర్లు నార్నె శ్రీనివాసరావు, దొడ్ల వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు బస్సుల్లో ర్యాలీగా బయలుదేరి వెళ్లారు.
- **కుత్బుల్లాపూర్, జోన్ బృందం:** ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని నిజాంపేట్ కార్పొరేషన్, బాచుపల్లి, కొంపల్లి, గాజులరామారం జంటసర్కిళ్ల పరిధిలోని డివిజన్ల కార్పొరేటర్లు, ఛైర్మన్‌లు, వైస్ ఛైర్మన్లు, కార్యకర్తలు, బీఆర్ఎస్ నాయకులు, అభిమానులు బస్సుల్లో తరలి వెళ్లారు.
- **బాలానగర్/ ఓల్డుబోయినపల్లి/ ఫతేనగర్:** బాలానగర్, ఓల్డుబోయినపల్లి, ఫతేనగర్ డివిజన్ల నుంచి బీఆర్ఎస్ పార్టీ నాయకులు తరలి వెళ్లారు.
- **కూకట్‌పల్లి:** కూకట్‌పల్లి నుంచి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో... వీవీనగర్ నుంచి మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు ఆధ్వర్యంలో డివిజన్ల కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు బస్సుల్లో తరలివెళ్లారు.